

బీఆర్ఎస్ కల్పించిన ఉద్యోగాలకు
కాంగ్రెస్ మేళాలు

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 13: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్పించిన ఉద్యోగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మేళాలు జరుపుకుంటూ ప్రజలను మభ్యపెట్టడం సరికాదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాలలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. త్యాగాల పునాదుల చరిత్ర బీఆర్ఎస్‌దైతే, అబద్ధపు పునాదులపై కాంగ్రెస్ కాలం వెల్లదీస్తుందని చెప్పారు. తెలంగాణ ప్రజల కష్టసుఖాల్లో తాము పాలుపంచుకుంటూ రాష్ట్రాన్ని దేశానికి అగ్రగామిగా తీర్చిదిద్దగా, కల్లిబొల్లి మాటలతో కాంగ్రెస్ అతలాకుతలం చేస్తుందన్నారు. కొన్ని నెలలక్రితం బీఆర్ఎస్ 30వేల ఉద్యోగాలకు అన్ని ప్రకియలు పూర్తి చేసి నియామకపత్రాలు అందించడమే తరువాయిగా మారిన సందర్భంలో, ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదన్నారు. పైగా తామే ఉద్యోగాలిచ్చామని అసత్య ప్రచారం చేసుకుంటుందని, బీఆర్ఎస్ ఉద్యోగాలను రోజుకో మేళా పేరిట డప్పు కొట్టుకుంటుందన్నారు. 24గంటల విద్యుత్‌తో పాటు రైతాంగానికి సాగునీరు ఇవ్వకుండా పంటలు ఎండబెట్టి ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఆరు గ్యారంటీలను అమలుచేయకుండా వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. రైతాంగంపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే సాగునీరు అందించి పంటలు ఎండకుండా చూడాలని హితవు పలికారు.

సాగునీరందించినపుడే ఎమ్మెల్యేగా సక్సెస్

● హుస్నాబాద్ ఆసుపత్రిని

250 పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్


హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మార్చి 13 : గౌరవెల్లి రిజర్వాయర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, కాలువలు నిర్మించి పంట పొలాలకు గోదావరి నీరు అందించినపుడే తాను ఎమ్మెల్యేగా సక్సెస్ అయినట్లుగా భావిస్తానని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో రూ.18.50 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు, మండలంలో రూ.98లక్షలతో చేపట్టే పలు పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందే రాజకీయాలని, ఎన్నికల తర్వాత అభివృద్ధే ఎజెండాగా పనిచేద్దామని చెప్పారు. వేసవిలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. రూ.5 కోట్లతో తాగునీటి ఎద్దడి రాకుండా రెండు నెలల ముందుగానే అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించామని ఆయన పేర్కొన్నారు. కొత్తగా 1000 ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో వాటర్ ప్యూరిఫైడ్ ప్లాంట్లను నిర్మిస్తామని తెలిపారు. హుస్నాబాద్‌లో ఉన్న 100 పడకల ఆసుపత్రిని 250 పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తామని, ప్రియాంకగాంధీ ఇచ్చిన హామీ మేరకు మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమాల్లో కలెక్టర్ మనుచౌదరి, జడ్పీ వైస్‌చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీ మానస, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఆర్డీవో బెన్‌షాలోమ్, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను నూతన భవనంలోకి మార్చాలి

డిగ్రీ కళాశాలను నూతన భవనంలోకి షిఫ్ట్ చేసి గురువారం నుంచి అందులోనే తరగతులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ అనివేటి మండప శిలాన్యాస కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ కలెక్టర్ మనుచౌదరితో కలిసి శంకుస్థాపన చేశారు. సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారి నిర్మాణంతో హుస్నాబాద్‌లో భవనాలకు నష్టం వాటిల్లుతుందని పలువురు వ్యాపారులు మంత్రికి విన్నవించడంతో ఈఎన్‌సీ గణపతిరెడ్డితో కలిసి ఆయన పట్టణ రహదారిని పరిశీలించారు. ఎవరికి నష్టం లేకుండా చూస్తామన్నారు.

బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నాం

కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడే 16 కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎంపీగా పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పెట్టడంలో తన పాత్ర ఉందని, అలాగే బీసీ కులాల కార్పొరేషన్ ఏర్పాటులోనూ తన కృషి ఉందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆలయాల్లో భక్తుల తాకిడి పెరిగిందని, ఆలయాలకు ఆదాయం కూడా పెరిగిందని వెల్లడించారు.

నిమిషం ఆలస్యమైనా
నో ఎంట్రీ
● పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
● జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి
8 లో

జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌కుమార్..
మెదక్ బీజేపీ టికెట్ రఘునందన్‌కే..

లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన పార్టీలు


రఘునందన్‌రావు


గాలి అనిల్‌కుమార్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంగారెడ్డి, మార్చి 13 : లోక్‌సభ ఎన్నికలకు పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి. నోటిఫికేషన్ త్వరలోనే వెలువడే అవకాశం ఉందనే వార్తల నేపథ్యంలో ప్రధాన పార్టీలు ఉమ్మడి జిల్లాలోని రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తరపున మెదక్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు బరిలో దిగనున్నారు. ఈమేరకు ఆ పార్టీ అధిష్ఠానం బుధవారం రాత్రి ప్రకటన చేసింది. రఘునందన్‌రావు 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా దుబ్బాక నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2020లో జరిగిన ఉపఎన్నికలో ఆయన దుబ్బాక నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే స్థానం నుంచి పోటీ చేసినా ఓడిపోయారు. అప్పటి నుంచే ఆయన పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమై టికెట్ కోసం ప్రయత్నాలు సాగించారు. మరోవైపు, మెదక్ టికెట్ ఆశించిన బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పార్టీ నాయకుడు, జిల్లా అధ్యక్షురాలు గోదావరి భర్త అంజిరెడ్డి, గజ్వేల్‌కు చెందిన గురువారెడ్డి తదితరులకు నిరాశ తప్పలేదు.

బీఆర్ఎస్ తరపున 'గాలి'

జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ టికెట్ గాలి అనిల్‌కుమార్‌కు కేటాయిస్తున్నట్టు ఆ పార్టీ అధినాయకత్వం బుధవారం రాత్రి ప్రకటించింది. జహీరాబాద్ బీఆర్ఎస్ టికెట్ ఆయనకేననే విషయం 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 7న ప్రచురించిన విషయం తెలిసిందే. పటాన్‌చెరుకు చెందిన అనిల్‌కుమార్ 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మెదక్ స్థానం నుంచి పార్లమెంట్‌కు పోటీచేసి ఓడిపోయారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పుడు కూడా మెదక్ పార్లమెంట్ టికెట్ ఆశించినా.. ఆయనకు ఏమాత్రం సంబంధం లేని జహీరాబాద్ టికెట్‌ను నాయకత్వం ఖరారు చేసింది. ఇక్కడి నుంచి బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీబీపాటిల్ ఇటీవలే బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దీంతో అర్థికంగా బలంగా ఉన్న మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన గాలి అనిల్‌కుమార్‌ను అభ్యర్థిగా నాయకత్వం నిర్ణయించింది. ఈ నియోజకవర్గంలో మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన ఓట్లు 1.20 లక్షలు ఉన్నాయి.

నత్తనడకన ఎల్‌ఆర్‌ఎస్

- దరఖాస్తుల పరిశీలనలో జాప్యం
- జిల్లాలో 14,155 దరఖాస్తులు దరఖాస్తులు
- క్రమబద్ధీకరణకు మార్చి 31 వరకు గడువు
- అర్జీదారుల్లో ఆందోళన



మెదక్, మార్చి 13 : మున్సిపాలిటీల్లో స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతున్నది. నిబంధనలు పాటించకుండా కొనుగోలు చేసిన స్థలాలను క్రమబద్ధీకరించడానికి 2020లో అప్పటి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తీసుకొచ్చింది. అప్పట్లో మెదక్ జిల్లావ్యాప్తంగా 14,155 దరఖాస్తులు వచ్చాయి. తూప్రాన్ మున్సిపాలిటీలో 6,300 దరఖాస్తులు, మెదక్ మున్సిపాలిటీలో 3,565 దరఖాస్తులు, రామాయంపేట మున్సిపాలిటీలో 2,490 దరఖాస్తులు, నర్సాపూర్ మున్సిపాలిటీలో 1,800 దరఖాస్తులు వచ్చాయి.

మూడేళ్లుగా నిరీక్షణ

స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నవారు మూడేళ్లుగా నిరీక్షిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు పచ్చజెండా ఊపింది. వివాదాస్పద, కోర్టు పరిధిలో ఉన్న భూములు, దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు ఇతర లేఅవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు అవకాశం కల్పించింది. పాత నిబంధనల ప్రకారమే క్రమబద్ధీకరణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మార్చి 31లోపు నిర్ణీత రుసుం చెల్లించి స్థలాలను రెగ్యులరైజ్ చేసుకునేందుకు సర్కారు అవకాశం కల్పించింది. అయితే, మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారులు దరఖాస్తులు నెమ్మదిగా పరిశీలిస్తున్నారని అర్జీదారులు వాపోతున్నారు. మరిన్ని పత్రాలు తీసుకురావాలని ఫోన్లు చేసి చెబుతున్నారని విమర్శిస్తున్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారుల కొరత

ప్రస్తుతం మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో టౌన్‌ప్లానింగ్ అధికారుల కొరత ఉంది. మెదక్, నర్సాపూర్, కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి మున్సిపాలిటీలకు కలిపి ఒక్కరే టౌన్‌ప్లానింగ్ అధికారి విధులు నిర్వహిస్తున్నారు. రామాయంపేట, సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మున్సిపాలిటీలకు ఒక్కరు పనిచేస్తున్నారు. మెదక్ మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 3,565 అప్లికేషన్లు రాగా.. 626 దరఖాస్తులు మాత్రమే ప్రాసెస్‌లో ఉన్నాయని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తెలిపారు. రామాయంపేటలో 2,490 దరఖాస్తులకు 200, తూప్రాన్‌లో 6,300 దరఖాస్తులు 30, నర్సాపూర్‌లో 1,800 దరఖాస్తులకు 10 అప్లికేషన్లు పరిశీలనలో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈ నెల 31తో గడువు ముగుస్తుండడంతో పరిశీలన ఇంత నెమ్మదిగా సాగుతుండడంపై అర్జీదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ప్లాట్లకు మోక్షం లభిస్తుందని సంతోషించినా.. గడువు లోపు దరఖాస్తుల పరిశబూలన పూర్తవుతుందో లేదోనని వాపోతున్నారు.

సమయపాలన పాటించని వైద్యులు

- ఉదయం 10.30 దాటిన పత్తాలేని వైనం

అక్కన్నపేట, మార్చి 13: అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం 9 గంటలకే విధులకు హాజరు కావాల్సిన వైద్యులు, సిబ్బంది సమయపాలన లేకుండా ఇష్టానుసారంగా వస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన గుంటి చంద్రవ్వ అనే వృద్ధురాలు జ్వరం, నరాలు, మెడ నొప్పులతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. ఉదయం 10.30 గంటలు దాటిన వైద్యులు రాలేదు. ఇద్దరు సిబ్బంది మాత్రమే వచ్చారు. డాక్టరు ఎప్పుడు వస్తారని అంతసేపు ఎదురుచూసిన ఆ వృద్ధురాలు సిబ్బందిని అడిగగా, విజిట్‌కు వెళ్లారు ఇప్పుడు రారు అంటూ సమాధానమిచ్చారు. వృద్ధురాలుని వైద్య సిబ్బంది ఏమైందని అడిగి రెండు టాబ్లెట్ ఇవ్వడంతో నిరాశగా తిరిగి వెళ్లింది. ఇలా ప్రతిరోజు వైద్య సేవల కోసం రోగులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంటున్నది. ఎప్పుడు ఆసుపత్రికి వెళ్లిన వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఆసుపత్రి వైద్య సిబ్బందిని వివరణ కోరగా డాక్టరు గ్రామాల్లో విజిట్‌కు వెళ్లారని సమాధానమిచ్చారు.




అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ గది

చెరువు మింగిన ఇళ్ల స్థలాలు

అమీన్‌పూర్ పెద్ద చెరువులో నీట మునిగిన ప్లాట్లు

అమీన్‌పూర్ పెద్దచెరువు నీటిమట్టం పెరగడంతో నీట మునిగిన ప్లాట్లు



- స్థలాలు కోల్పోయిన దాదాపు ఐదు వేల మంది బాధితులు
- పదేళ్లుగా దిగువకు నీటిని వదలకపోవడంతో పెరిగిన నీటి మట్టం
- చెరువు విస్తీర్ణం పెరిగి ప్లాట్లు కనుమరుగు
- కాగితాలకే పరిమితమైన జీవవైవిధ్యం
- మురికికూపంలా మారిన పెద్ద చెరువు
- జేఏసీగా ఏర్పడి న్యాయం కోసం పోరాడుతున్న బాధితులు

పటాన్‌చెరు, మార్చి 13: అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపుతో ఇండ్ల స్థలాలను కోల్పోయిన దాదాపు ఐదు వేల మంది బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇటీవల నిర్వహించిన సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ప్లాట్ల యజమానులు హాజరయ్యారు. చెరువు చుట్టుపక్కల ముంపునకు గురైన సుమారు 30 కాలనీల నుంచి తరలివచ్చారు. చిరునామా సత్యనారాయణను సారథ్యంలో జాయింట్ యాక్షన్ కమిటీని ఎన్నుకున్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి న్యాయం చేయమని కోరతామన్నారు.

నేపథ్యం ఇదీ..

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దచెరువు చుట్టుపక్కల ప్రాంతంలో దాదాపు 25 ఏళ్ల క్రితం 30కి పైగా లేఅవుట్లు వేశారు. వీటిలో వేలాది మంది ప్లాట్లను కొన్నారు. అయితే, గత పదేళ్లుగా అమీన్‌పూర్ పెద్ద చెరువు నీటిని కాలువలు, తూముల ద్వారా కిందికి వదలకపోవడంతో చెరువులో నీటి మట్టం పెరిగింది. ఫలితంగా వేలాది ప్లాట్లు చెరువులో మునిగిపోయాయి. కుటుంబం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలు ఇప్పుడు చేతికి రాకుండా పోవటంతో వాటిని కొన్న వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లుగా తమ సమస్యపై ప్రభుత్వానికి విన్నవించే ప్రయత్నాలు చేసినా ఫలితం లభించలేదని చెబుతున్నారు. సదరు చెరువును జీవవైవిధ్య ప్రాంతంగా గుర్తించినందున నీటిని కిందికి వదిలేది లేదని అధికారులు అంటున్నారని పేర్కొంటున్నారు. వాస్తవానికి రెవెన్యూ రికార్డుల ప్రకారం చెరువు విస్తీర్ణం 97 ఎకరాలే అయినప్పటికీ.. నీటి మట్టం పెరిగిపోవటంతో మినీ రిజర్వాయర్‌గా తయారైంది. నిరంతరం మియాపూర్, బాచుపల్లి తదితర ఎగువన ఉన్న కాలనీల నుంచి పెద్ద ఎత్తున మురుగునీరు వచ్చిచేరడంతో నిండువేసవిలో సైతం చెరువు నిండుకుండను తలపిస్తోంది. పెద్ద చెరువు కింద మొత్తం 14 గొలుసుకట్టు చెరువులు, కుంటలు ఉన్నాయి. పెద్ద చెరువు నీటిని ఏటా దిగువకు వదలకపోవడంతో ఈ చెరువులు, కుంటలు క్రమంగా కబ్జాలకు గురై కనుమరుగవుతున్నాయి. అయినప్పటికీ, నీటి విడుదల జరగటం లేదు. పెద్ద చెరువులో చేపలు పెంచే వారు సైతం దిగువకు నీరు వదలకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. కాగా, పెద్ద చెరువు నీటి ముంపు కారణంగా ఇళ్ల స్థలాలతో పాటు వ్యవసాయ భూములు కూడా ఏళ్ల తరబడి నీట మునిగిపోతున్నాయి. దీంతో ఆయా భూముల రైతులు సాగును పక్కనపెట్టారు. విచిత్రమేమిటంటే గతంలో హుడా, హెచ్ఎండీఏ, పంచాయతీ అనుమతులతో వేసిన లేఅవుట్లు సైతం నీట మునిగాయి. సర్వేనెంబర్లు 196, 197, 198, 146, 149, 176, 177, 323, 324, 209, 211, 174, 199, 200, 202, 203, 205 లలోని దర్శన్‌నగర్, పాంచజన్య, వెదిరి, పద్మావతినగర్, వాణినగర్, ఆర్‌కే 1, ఆర్‌కే 2, ఆర్‌కే 3 తదితర 30 కాలనీలలోని ప్లాట్లు పెద్ద చెరువునీటిలో మునిగిపోయాయి. సుమారు ఐదువేల మంది ప్లాట్లు కోల్పోయారు. పదుల సంఖ్యలో రైతుల భూములు జలమయం అయ్యాయి. పాంచజన్య కాలనీలో ఓ ఇన్‌కంటాక్స్ అధికారి పదేళ్ల క్రితం రెండస్తుల భవనం నిర్మించిన తరువాత చెరువు నీరు పెరగడంతో దానిని అసంపూర్తిగా వదిలేశారు. పదేళ్లుగా చెరువు నీటిలోనే ఉన్న ఆ అసంపూర్తి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది.



పాంచజన్య లేఅవుట్ జలమయం అవడంతో అసంపూర్తిగా వదిలేసిన రెండంతస్తుల భవనం



జేఏసీని ఏర్పాటు చేస్తున్న ముంపు బాధితులు(ఫైల్)

అభివృద్ధి శూన్యం

అమీన్‌పూర్ పెద్ద చెరువును జీవవైవిధ్య చెరువుగా ప్రభుత్వం గుర్తించినా గతం నుంచీ ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టలేదు. చెరువులోకి నిరంతరం డ్రైనేజీ, పారిశ్రామిక వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. ఈ మురుగునీరు వల్ల.. జీవవైవిధ్యం మాట అటుంచి.. చెరువు పరిసరాలు కంపుకొడుతూ సమీపప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో చెరువునీటిని శుద్ధి చేసేందుకు ఎస్‌టీపీ ప్లాంటు ఏర్పాటు చేస్తామని హెచ్ఎండీఏ అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాలేదు. ఇకనైనా చెరువు నీటిని దిగువకు వదిలి వాస్తవ చెరువు విస్తీర్ణాన్ని పరిరక్షిస్తూ, కలుషితం కాకుండా చూడాలని చెరువు చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు డిమాండ్ చేస్తున్నారు.

కిడ్నీలపై నిర్లక్ష్యం తగదు

- మధుమేహం, రక్తపోటు అదుపులో ఉంచుకోవాలి
- తగిన జాగ్రత్తలతో మూత్రపిండాల సమస్యలు దూరం
- నేడు వరల్డ్ కిడ్నీ డే



మెదక్ కల్చరల్, మార్చి 13 : ఇటీవల మూత్రపిండాలు(కిడ్నీ) సంబంధిత వ్యాధులతో బాధపడే వారు ఎక్కువవుతున్నారని ఆరోగ్య సంస్థలు చెబుతున్నాయి. మానవ శరీరరంలో కిడ్నీలు కీలకం. ఇవి రక్తంలో కలుస్తున్న మలినాలను వడపోసి శరీరం నుంచి తొలగిస్తాయి. కిడ్నీలు విరామం లేకుండా పనిచేస్తూ రక్తాన్ని శుభ్రంగా ఉంచుతాయి. ఒక రోజులో మానవుని మూత్రపిండాలు దాదాపు 200 లీటర్ల రక్తాన్నిశుద్ధి చేస్తాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. రక్తపోటును నియంత్రించడంలోనూ ముఖ్య పాత్ర పోషిస్తాయి. అయితే కొన్నిసార్లు మూత్రపిండాల సమస్య ఉన్నట్టు గుర్తించలేకపోవచ్చు. మూత్రపిండాలు పనిచేయడం మానేస్తే రక్తం, శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి ఈ పరిస్థితిని అజోటేమియా అంటారు. కిడ్నీల సంరక్షణ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం అవసరం అంటున్నారు వైద్యులు. మెదక్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో సంవత్సర కాలం నుంచి ఇప్పటివరకు 72 మంది కిడ్నీ రోగులకు 9226 సార్లు డయాలసిస్ చేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు.

సమస్యలుంటే గుర్తించడం ఇలా

రక్తం యూరియా స్థాయి పెరిగినప్పుడు వాంతులు, డయేరియాకు దారితీస్తాయి. దీనిని గమనించాలి. వికారంగా ఉండడం, బరువు తగ్గడం, రాత్రి సమయాల్లో మూత్రం అధికంగా రావడం, మూత్రంలో నురగలు రావడం, మూత్రం రంగుమారి కనిపించడం, రక్తం వస్తుండడం వంటివి గమనిస్తే వైద్యులను సంప్రదించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మధుమేహం, రక్తపోటు ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. వారిలో మూత్రపిండాల సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ. బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలి. ఎక్కువ ప్రోటీన్ కలిగిన మాంసాహారాన్ని మితంగా తీసుకోవాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. నీరు ఎక్కువగా తాగాలి. యాభై ఏళ్లు పైబడిన వారు, ఊబకాయం ఉన్నవారు క్రమం తప్పకుండా కిడ్నీ సంబంధిత పరీక్షలు చేయించుకోవడం మంచిది.

ఎక్కువగా నీరు తాగాలి

కిడ్నీ వ్యాధులు రాకుండా ఉండాలంటే ఎక్కువగా నీరు తాగాలి. ముఖ్యంగా నొప్పి నివారణ మందులు అవసరమైతే తప్ప వాడకూడదు. ఎక్కువ ప్రోటీన్లు కలిగిన మాంసాహారాన్ని తగ్గించాలి. అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులు వైద్యులు సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడాలి. నిత్యం బీపీ, షుగర్ చెక్‌చేసుకోవాలి మూత్రం మంటగా ఉన్న వెంటనే వైద్యులను సంప్రదించాలి. మెదక్ జిల్లా ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అవసరమున్న వారు వినియోగించుకోవాలి.

- డాక్టర్ చంద్రశేఖర్, మెదక్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్

తుమ్మచెట్లు, తుంగలు..

మురికి కూపం

డ్రైనేజీ నీటి చేరికతో కలుషితమైన చేర్యాల కుడిచెరువు



కుడిచెరువులో ఏపుగా పెరిగిన తుంగ, పిచ్చిమొక్కలు

చేర్యాల, మార్చి 13 : చారిత్రక నేపథ్యం కలిగిన చేర్యాల పట్టణంలోని కు(గు)డి చెరువు కంపు కొడుతుంది. భూగర్భ జలాల పెంపుతో పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి ఆదరువుగా మారిన ఈ చెరువు అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో గబ్బుమయంగా మారింది. డ్రైనేజీ ద్వారా చెరువులోకి మురుగునీటిని మళ్లిస్తుండటంతో పాటు తుమ్మచెట్లు, తుంగలు, ముళ్ల కంపలు, వ్యర్థాలు పేరుకుపోయి చెరువులో నీరు కలుషితమవుతోంది.

చిన్న నీటిపారుదలశాఖ పరిధిలో ఉన్న చేర్యాల కుడి చెరువుకు సర్వే నెం.202లో 60.21ఎకరాల శిఖం భూములు ఉన్నాయి. శిఖంను ఆనుకుని సుమారు 39 ఎకరాల పట్టాభూమి ఉంది. ఆయా భూముల్లో పలువురు రైతులు సాగు చేసుకుంటున్నారు. చెరువు ప్రాంగణంలో మహమ్మాయి, మార్కండేయ ఆలయాలు ఉన్నాయి. ఏటా ఆలయాల ప్రాంగణాల్లో మహిళలు బతుకమ్మ ఆడి ఇదే చెరువులో నిమజ్జనం చేస్తారు. అంతేకాకుండా నవరాత్రి ఉత్సవాల సమయంలో వినాయక, దేవీ, ఇతర దేవతామూర్తులను ఇదే చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆయా సమయాలలో చెరువు ప్రాంగణాన్ని ముస్తాబు చేస్తున్న క్రమంలో కొన్నాళ్ల క్రితం సీసీ ఫ్లోరింగ్ చేపట్టి బతుకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

సుందరీకరణకు నోచుకోలేక..

కుడిచెరువును సుందరీకరించాల్సి ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. చెరువులో తుమ్మచెట్లు భారీగా పెరిగాయి. చెత్తాచెదారం, ముళ్లకంపలు పేరుకుపోయాయి. వరదనీటికి తోడు డ్రైనేజీ నీరు చేరుతుండటంతో చెరువు మురికికూపంగా మారుతోంది. పట్టణంలోని పెద్దచెరువు గోదావరి జలాలతో నింపుతుండటం, కలుషిత పరిస్థితులు లేకపోవడంతో నీరు తేటతెల్లగా ఉండి ఆహ్లాదాన్నందిస్తుండగా, కుడిచెరువు మాత్రం రంగు మారిపోతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



తుమ్మచెట్లపై పక్షులు

వందలాది పక్షులకు నిలయం

చెరువులో భారీగా తుమ్మచెట్లు పెరగడంతో వేలాలాది పక్షులు ఆవాసం ఏర్పరుచుకున్నాయి. ఏచెట్టును చూసినా వందలాది పక్షులు కనువిందు చేస్తున్నాయి. తెల్లవారుజామున పక్షులు చేస్తున్న సందడిని చూసేందుకు వెళుతుండగా, కంపువాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

డ్రైనేజీలతోనైనా ఊరట కలిగినా?

జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుపై పడిన వర్షపు నీటిని మళ్లించేందుకు ప్రస్తుతం కాలువ పనులు చేపడుతున్నారు. ఈ పనుల కోసం గతంలో డ్రైనేజీ కాలువలను తొలగించగా, కొత్తగా కడుతున్న కాలువలోకి అనుసంధానం చేస్తారా.. లేదా మునిసిపల్ ఆధ్వర్యంలో మరో డ్రైనేజీ కాలువ నిర్మిస్తారా అన్న విషయమై సందిగ్ధత నెలకొన్నది. ఒకవేళ వర్షపునీటి మళ్లింపునకు మాత్రమే డ్రైన్‌కాలువను వినియోగిస్తే కుడి చెరువులోకి మురుగు నీరు చేరే పరిస్థితి తలెత్తదు. దీంతో కాలుష్యకోరల నుంచి బయటపడుతుంది, లేదంటే అంతే సంగతి. అధికారులు, ప్రజాప్రతినిధులు నిద్రమత్తు వీడి కుడిచెరువులోని తుంగ, తుమ్మలు, వ్యర్థాలను తొలగించి మురుగు నీటి మళ్లింపును నిలిపివేయడంతో పాటు సుందకరీకరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చెరువు కట్ట



చెరువులో భారీగా ఉన్న తుమ్మచెట్లు

గౌరవెల్లి డిస్ట్రిబ్యూటరీ కాలువల కోసం భూసేకరణ పూర్తి చేయాలి



ప్రాజెక్టు వివరాలను కలెక్టర్ కు వివరిస్తున్న అధికారులు

అక్కన్నపేట, మార్చి 13: గౌరవెల్లి ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి అవసరమయ్యే భూసేకరణ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను మ్యాప్ ద్వారా ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కాలువల నిర్మాణానికి సంబంధించి ఏజెన్సీలకు అప్పగించామని మూడునెలల్లో పూర్తి చేయిస్తామని ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. ఆయన వెంట హుస్నాబాద్ ఆర్డీవో బెన్ శాలెమ్, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ప్రాజెక్టు డీఈలు ప్రశాంత్, కరుణశ్రీ ఉన్నారు.

రెండు లైన్ల రోడ్డుకు శంకుస్థాపన

కోహెడ, మార్చి 13: కోహెడ మండల కేంద్రం నుంచి సముద్రాల క్రాస్ రోడ్డు వరకు రూ 50 కోట్ల నిధులతో చేపట్టనున్న రెండు వరుసల రహదారి నిర్మాణానికి జిల్లా కలెక్టర్ ఎం మనూచౌదరి బుధవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టే పనులకు సంబంధించి ఒకే శిలాఫలకంపై ఆవిష్కరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రూ 28 లక్షలతో 12 పనులు, అలాగే రూ. 50 లక్షలతో చేపట్టే మరో 11 పనులకు జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి శంకుస్థాపన చేశారు. ఈ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో హుస్నాబాద్ ఆర్డీవో బెన్ శాలెం, ఎంపీపీ కీర్తి సురేష్, జడ్పీటీసీ శ్యామల, ఎంపీడీవో కిష్టయ్య, తహసీల్దార్ సురేఖ, సంబంధిత శాఖల అధికారులు తదితరులున్నారు.

సాగునీరు అందక ఎండుతున్న పంటలు

● ఆదుకోవాలని శనిగకుంట రైతుల ఆందోళన



శనిగకుంటలో ఎండిపోయిన వరిపంటను చూపిస్తూ ఆందోళన చెందుతున్న రైతులు

నారాయణరావుపేట, మార్చి 13: సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శనిగకుంట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం శనిగకుంట రైతులు తమ వ్యవసాయ పొలాల వద్ద ఎండిపోయిన పంటలను చూపిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని 500 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నామని, సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు వారి అవేదన వెళ్లగక్కారు. పంట దిగుబడి వస్తుందని ఆశించి ఎరువులకు ఎంతో పెట్టుబడి పెట్టి నష్టపోతున్నామని రైతులు వాపోయారు. సాగునీరు లేక ఎన్నో ఇబ్బందులు ఎదురు అవుతున్నాయని, సాగునీటి కోసం వ్యవసాయ బావులు తవ్విన నీరు రావడంలేదని తెలిపారు. విద్యుత్ సరఫరాలోను అంతరాయం ఏర్పడుతుందని అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి తమ సమస్యను పరిష్కారం చేయాలని కోరారు.

మా సాగునీటి కష్టాల గురించి ఇప్పటి వరకు ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పంటలు ఎండిపోతే తమకు ఇక ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయమే జీవనాధారంగా కుటుంబాలను పోషించుకుంటున్న తమకు రోజురోజుకూ అప్పులు ఎక్కువవుతున్నాయన్నారు.

అధికారులు స్పందించి వెంటనే సాగునీరు అందించి పంటలను కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చేర్యాల పట్టణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి: కొమ్మూరి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కొమ్మూరి

చేర్యాల, మార్చి 13: చేర్యాల పట్టణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణ శివారులోని కేపీఆర్ నగర్‌లో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణం పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పటణంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.60కోట్లు నిధులు మంజూరుచేసిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆడెపు నరేందర్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, నాయకులు కొమ్ము రవి, కాటం శ్రీనివాస్, దాసరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు ఊరట

● మినిమం టైం స్కేలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం

సంగారెడ్డి అర్బన్, మార్చి 13: ఎట్టకేలకు 2008-డీఎస్సీ అభ్యర్థుల నిరీక్షణకు ఫలితం లభించింది. వివిధ కారణాలతో 2008 డీఎస్సీ అభ్యర్థుల నియామక ప్రక్రియ నిలిచింది. అభ్యర్థులకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చినా గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా 2008 డీఎస్సీ అభ్యర్థులకు మినిమమ్ టైం స్కేలుతో నియామకాలు చేపట్టాలని మంగళవారం రాత్రి రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నది. దీంతో రాత పరీక్ష ద్వారా ఎంపికై నియామకాల కోసం వేచిచూస్తున్న అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇలా ఉండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీఎస్సీని నిర్వహించగా, అప్పుడు ఉమ్మడి మెదక్ జిల్లాలో 292 మంది డీఎస్సీ రాత పరీక్షలో ఎంపికయ్యారు. ఎట్టకేలకు కొత్త సర్కారు పదిహేడేళ్ల నిరీక్షణకు తెరదించుతూ నియామకాలకు ఆమోద ముద్రవేయడంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, 2008 డీఎస్సీ రాత పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థుల్లో ఎంత మంది విధుల్లో చేరేందుకు సానుకూలంగా ఉన్నారో వివరాలు సేకరించే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది.

మొబైల్ యాప్‌తో చీడపీడలను గుర్తించవచ్చు

చిన్నకోడూరు, మార్చి 13: ఎన్‌పీఎస్‌ఎస్ మొబైల్ యాప్ ద్వారా సకాలంలో చీడపీడలను గుర్తించవచ్చని జీడిమెట్ల కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారి సునీత అన్నారు. మండలంలోని మాచాపూర్ రైతు వేదికలో బుధవారం సిద్దిపేట, మెదక్, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 30 మంది రైతులకు జాతీయ పురుగు, తెగులు నిఘా సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌పీఎస్‌ఎస్ మొబైల్ యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో పంట పొలాలకు వెళ్లి చీడపీడల ఫొటోలను ఎన్‌పీఎస్‌ఎస్ మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మ, సహాయ సస్యరక్షణ అధికారులు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మర్కుక్ ఎంపీపీ పాండుగౌడ్

మర్కుక్, మార్చి 13: మర్కుక్ మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షుడు ఎంపీపీ పాండుగౌడ్ అధ్యక్షతన స్థానిక ఎస్సీ కమ్యునిటీహాల్‌లో జరిగింది.ఈ సందర్భంగా గ్రామాలలో సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎంపీపీ ఆదేశించారు. అనంతరం వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడంపై మండిపడ్డారు. ఎంపీపీతో సహా పలువురు ఎంపీటీసీలు ప్రొటోకాల్ విషయమై అసహనం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మేము ప్రజలు ఓట్లువేసి పంపిన ప్రతినిధులం, ప్రజా క్షేమం కోసం నిత్యం అందుబాటులో ఉంటున్న మాకు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేటప్పుడు కనీసం సమాచారం ఇవ్వకుండా ఉండడమే కాకుండా ఫోన్ ద్వారా అడిగినా కూడా సమాధానం దాటవేసిన అధికారులు ఇకనైనా తప్పకుండా ప్రొటోకాల్ పాటించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక జడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీడీఓ ఎండీ అబ్బలుద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

ములుగు, మార్చి 13: వేసవికాలంలో ప్రజలకు తాగునీరు, విద్యుత్ ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఎంపీపీ లావణ్య, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో విద్యుత్, తాగునీటికి సమస్య రాకుండా అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు లింగారెడ్డి, ఎంపీటీసీలు నవ్యశ్రీ, మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ, కేవిఎస్ శర్మతో పాటు వివిధ శాఖలకు సంబందించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలికి అండగా బ్యాచ్‌మేట్స్



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

చేర్యాల, మార్చి 13 : మండలంలోని ముస్త్యాల గ్రామానికి చెందిన జి.మంజుల భర్త అబ్బులింగం ఇటీవల మృతి చెందాడు. స్నేహితురాలి భర్త మృతిపై సంతాపం వ్యక్తంచేస్తూ బ్యాచ్‌మేట్స్ చేయూతనందించారు. ఈ మేరకు ముస్త్యాల జడ్పీఎస్ఎస్ 2000-01 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు బుక్క సంతోశ్, శ్రీధర్, శంకర్, చిరంజీవి, లక్ష్మణ్, సతీశ్ తదితరులు తలా కొంత డబ్బు వేసుకుని రూ.50,600 నగదును బుధవారం ఆమెకు అందజేశారు. అలాగే చేర్యాల మున్సిపల్ వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందించారు.

మండల కేంద్రం అభివృద్ధికి కృషి

నారాయణరావుపేట, మార్చి 13: మండల కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో సుమారు రూ.12 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ అభివృద్ధిలో నారాయణరావుపేట మండల కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌ల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు సంతోష్ కుమార్, ఏఈ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బర్మ రాంచంద్రం, నాయకులు కరుణాకర్, బాబేష్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించడంతో యువతి ఆత్మహత్య

వర్గల్, మార్చి 13: వాళ్లిద్దరు కొంత కాలంగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామని ఆ యువతి ఒత్తిడి తేగా యువకుడితో పాటు అతడి కుటుంబసభ్యులు నిరాకరించడంతో ఆ యువతి తీవ్ర మనోవేదనకు గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన వర్గల్ మండలంలోని ఓ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి రెండేళ్ల నుంచి శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని ఓ పరిశ్రమలో ఉద్యోగం చేస్తుంది. ములుగు మండలం చిలసాగర్ గ్రామానికి చెందిన డీజే ఆపరేటర్ నారగళ్ల అభిషేక్ రెండేళ్లుగా ఆమెను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆ యువతి పెళ్లి చేసుకోమని నిలదీయగా ముఖం చాటేశాడు. పెళ్లికి కుటుంబసభ్యులు ఒప్పుకోవడంలేదంటూ తప్పించుకు తిరుగుతుండటంతో ఆ యువతి విషయాన్ని ఇంట్లో తల్లికి చెప్పింది. వెంటనే తల్లి తన అల్లుళ్లు, కూతురుతో కలిసి అభిషేక్‌తో వివాహం కోసం మాట్లాడటానికి వెళ్లగా అతడితో పాటు అతడి కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించి యువతిని దూషించారు. దీంతో ఆమె వారం రోజులుగా తీవ్ర మనస్తాపానికి గురైంది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంటగదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడన్న అవమానంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కడుపు నొప్పి భరించలేక కాంగ్రెస్‌నేత కుమార్తె..

● పాడె మోసిన మంత్రి పొన్నం



పాడె మోస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, శ్రీజ(ఫైల్)

హుస్నాబాద్, మార్చి 13: పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వేములవాడ దేవస్థాన ఉత్సవ కమిటీ సభ్యుడు వడ్డెపల్లి వెంకటరమణ కూతురు వడ్డెపల్లి శ్రీజ(21) బుధవారం తన ఇంట్లో కడుపు నొప్పి భరించలేక కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ తోట మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో ఫాండీ ఫైనల్ ఇయర్ చదువుతున్న శ్రీజ ఇటీవల ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో కడుపు నొప్పి భరించలేక ఇంట్లోని పై అంతస్తుకు వెళ్లి కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతురాలి తండ్రి రమణ మంత్రి పొన్నంకు అత్యంత సన్నిహితుడు. ఈ విషయం తెలిసినవెంటనే పట్టణంలోనే ఉన్న మంత్రి తన ఇతర కార్యక్రమాలను రద్దు చేసుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. చిన్న వయస్సులోనే శ్రీజ మృతి చెందడం పట్ల మంత్రి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి



సాగర్ (ఫైల్)

దుబ్బాక, మార్చి 13: బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండలంలోని బల్వంతాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకున్నది. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక గ్రామానికి చెందిన ఆస సాగర్(21) తన మిత్రుడితో కలిసి బైక్‌పై మచాపూర్ గ్రామానికి బయలుదేరాడు. బల్వంతాపూర్ గ్రామ శివారులోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి గుంతలో పడడంతో ఆససాగర్‌కు తీవ్రగాయాలు కాగా వెనుక కూర్చున్న వ్యక్తికి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. తీవ్ర గాయాలైన ఆస సాగర్‌ను కారులో దుబ్బాక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును జరుపుతున్నట్టు తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన లారీ.. డ్రైవర్ మృతి

దుబ్బాక రూరల్, మార్చి 13: మండలంలోని తిమ్మాపూర్ గ్రామశివారులో సిద్దిపేట- రామాయంపేట హైవే పక్కన నిర్మిస్తున్న మురికికాలువలోకి బుధవారం లారీ దూసుకెళ్లి బోల్తాపడటంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. రామాయంపేట రహదారి పైనుంచి లారీలో ఇనుపరాడ్లను తీసుకుని వస్తుండగా తిమ్మాపూర్ శివారులో ప్రమాదం సంభవించింది. బుధవారం తెల్లవారుజామున లారీ బోల్తాపడటంతో లారీ క్యాబిన్‌లో డ్రైవర్, క్లీనర్ చిక్కుకున్నారు. క్రేన్ ద్వారా క్యాబిన్‌ను తొలగించి ఇద్దరిని బయటకు తీయగా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంకు చెందిన డ్రైవర్ రామకర్‌యాదవ్(32) అక్కడికక్కడే మృతి చెందగా, రంగారెడ్డి జిల్లా నాచారానికి చెందిన క్లీనర్ షోయబ్‌కు గాయాలైనాయి. క్లీనర్ ఫిర్యాదు మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ గంగారాం తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి దుర్మరణం



మృతి చెందిన అండాలు

వర్గల్, మార్చి 13 : వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారిపై బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో నల్లా అండాలు(60) అనే వృద్ధురాలు దుర్మరణం చెందింది. గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సింగాయిపల్లి గ్రామానికి చెందిన నల్లా అండాలు గౌరారం గ్రామ సమీపంలోని ఓ హోటల్‌లో రోజువారి కూలీగా పనిచేస్తుంది. బుధవారం ఉదయం సింగాయిపల్లి గ్రామం నుంచి రాజీవ్ రహదారి గుండా నడుచుకుంటూ హోటల్ వైపు వెళ్తుండగా ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు సమీపంలో సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం నల్లా అండాలును వెనుకవైపు నుంచి బలంగా ఢీకొట్టింది. ఆమె తలకు తీవ్రగాయాలై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కూతురు బొద్దుల రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా

సిద్దిపేట క్రైం, మార్చి 13: జిల్లాలో చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఏసీపీ రవీందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించే వారిపై రవాణా చేసే వారిపై నిరంతరం నిఘా పెట్టామన్నారు. పేకాట జూదం ఆడే వారిపై గ్రామాలు, పట్టణాలలో ఇన్ఫర్మేషన్ వ్యవస్థను నూతనంగా ఏర్పాటు చేశామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఎవరికి సమాచారమున్నా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా టాస్క్ ఫోర్స్ ఏసీపీ సెల్ నంబర్ 8712667445కు సమాచారం అందించాలని కోరారు.

అంబేడ్కర్, పూలే ఆశయాల కోసం పోరాటం చేయాలి

● రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ

కుకునూరుపల్లి, మార్చి 13 : అంబేడ్కర్ పూలే ఆశయాల సాధనకై పోరాడాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ తెలిపారు. బుధవారం మంగోల్ గ్రామంలో అంబేడ్కర్ పూలే వారసుల చైతన్య రథయాత్రను విరాహత్ అలీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమాలకు పెట్టిన పేరైన మంగోల్ గ్రామం నుంచి మహనీయుల ఆశయ సాధన రథయాత్రను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సమాజంలో ఆర్థికంగా సామాజికంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు వివక్షకు గురవుతున్నారని వీరందరినీ ఏకం చేయడం కోసం రథయాత్రను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు తుమ్మ శ్రీనివాస్, గజ్వేల్ జర్నలిస్ట్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎన్నెల్లి సురేందర్, మంగోల్ తాజా మాజీ సర్పంచ్ పుల్లోజు కిరణ్ కుమార్‌చారి మాల, జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ మన్నె కృపానందం, మండల అధ్యక్షుడు దేవి నర్సింహులు, గ్రామ అధ్యక్షుడు తాడెం అనిల్, వివిధ బీసీ సంఘాల నాయకులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ఘనంగా మొల్లమాంబ జయంతి

గజ్వేల్, మార్చి 13: పట్టణంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గజ్వేల్ మండల అధ్యక్షుడు నాగపురి బాబు, కుమ్మరి కుల సంఘం నాయకుల సమక్షంలో శ్రీశ్రీ కవయిత్రి మొల్లమాంబ 584వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి పూలమాలవేసి ఆమె గొప్పతనాన్ని గుర్తుచేసుకొన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మండల కుమ్మరి సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి నాగపురి రమేష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొలిచెల్మె స్వామి, మండలం ఉపాధ్యక్షుడు కొలిచెల్మె మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శి తొవ్వల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి: డీఈవో

● నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాసరెడ్డి

సిద్దిపేట క్రైం, మార్చి 13 : ఈనెల 18 నుంచి జరిగే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.. బుధవారం సిద్దిపేటలోని మండల విద్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 80 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 13,987 మంది జనరల్ విద్యార్థులు, 1,661 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. 789 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలోని సిబ్బంది తప్పకుండా ఐడీ కార్డు ధరించి రావాలన్నారు. పరీక్షా సమయానికి నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతి లేదని తెలిపారు. పదోతరగతి పరీక్షలు రాసే ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల ఫీజుల విషయంలో యాజమాన్యాలు ఇబ్బంది పెడతాయనే ఉద్దేశంతో హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో తెలిపారు. హాల్ టికెట్‌పై ప్రధానోపాధ్యాయుడి సంతకం లేకున్నా పరీక్షకు అనుమతి ఉంటుందని డీఈవో స్పష్టం చేశారు. ఆయన వెంట సిద్దిపేట అర్బన్ మండల ఎంఈవో యాదవరెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి పి.లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన సీపీ

సిద్దిపేట సీపీ అనురాధ బుధవారం పట్టణంలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు జరిగే సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

గర్భిణులకు పోషకాహార లోపం లేకుండా చూడాలి



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

నారాయణరావుపేట, మార్చి 13: గ్రామాల్లోని చిన్నపిల్లలు, గర్భిణులకు పోషకాహార లోపం లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి పేర్కొన్నారు. బుధవారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో ఐసీడీఎస్ సెక్టర్ స్థాయిలో టెన్ మినిట్స్ ఇన్ అంగన్‌వాడీ, పోషణ పక్వాడ కార్యక్రమంలో డీపీవోతో పాటు డీడబ్ల్యూవో సావిత్రి, డీఎంహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాలు, ప్రీ స్కూల్ గుర్తించి వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. పోషణ పక్వాడ, చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాస్, సిడిపీఓ రమాదేవి, ఎంపీటీసీ హరీశ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



కొమురవెల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో ఆర్యవైశ్య నాయకులు సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.

చేర్యాల, మార్చి 12 : చేర్యాలలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాతబస్టాండు వద్ద కార్యక్రమంలో మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి తడకలింగమూర్తి మాట్లాడుతూ... సీఎం రేవంతర్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొమ్ము రవి, మంచాల చిరంజీవులు, ఆడెపు నరేందర్, దాసరి శ్రీకాంత్, వైశ్యసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● కోహెడ: కోహెడలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్పొరేషన్ ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు నీల రవీందర్, మండల అధ్యక్షుడు మల్యాల కరుణాకర్, గుండా శ్రీనివాస్, కొండూరు లక్ష్మీనారాయణ, గుండా మల్లేశం తదితరులు ఉన్నారు.

● కొమురవెల్లి : ఆర్య వైశ్య మహాసభ మండల, పట్టణ, యువజన, మహిళా విభాగాల ఆధ్వర్యంలో బుధవారం ఆలయ రాజగోపురం ఎదుట సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. టపాసులు కాల్చి సంబురాలు చేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు మంకాల నాగేష్, మండల ప్రధాన కార్యదర్శి రవికాంటి సత్యనారాయణ, కోశాధికారి జైన నరేష్, మండల యూత్ అధ్యక్షులు మంకాల రవి, మండల మహిళా అధ్యక్షురాలు మంకాల సరిత, జిల్లా నాయకులు మంకాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రజాకార్లను ఎదిరించిన ధీశాలి ప్రభాకర్‌రావు

● తెలంగాణాలో తొలి ఎన్‌కౌంటర్‌కు 75 ఏళ్లు పూర్తి



మహ్మదాపూర్‌లో నిర్మించిన అమరవీరుల స్మారక స్థూపం

హుస్నాబాద్‌రూరల్, మార్చి 13: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాట వీరుల త్యాగాలను ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహ్మదాపూర్ గుట్టల్లోని స్మారకస్థూపాలు కళ్లకు కడుతున్నాయి. నిజాం పాలనలో మహిళలు, యువకులపై రజాకార్లు సాగిస్తున్న ఆగడాలకు వ్యతిరేకంగా ప్రత్యక్ష పోరాటాలకు దిగిన పోలంపల్లి పులిబిడ్డ అనభేరి ప్రభాకర్‌రావుతో పాటు మొత్తం 12 మంది అమరులయ్యారు. ఈ ఘటన జరిగి నేటికి సరిగ్గా 75 ఏళ్లు గడిచిపోయాయి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్‌రావు నాటి దొరల అరాచకాలను ఎదుర్కోవడానికి సింగిరెడ్డి భూపతిరెడ్డితో కలిసి సాయుధపోరాటాలకు నాయకత్వం వహించారు. జమీందారీ కుటుంబంలో జన్మించిన అనభేరి ప్రభాకర్‌రావు గ్రామాల్లో పెత్తందార్ల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరుబాట పట్టి భూస్వాముల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు. ప్రజాసైన్యంతో వాడవాడలా ఎర్రజెండాలు ఎగురవేస్తూ పోరాటం సాగిస్తున్న దశలో 14 మార్చి 1948న ప్రభాకర్ దళం మహ్మదాపూర్‌కు చేరుకుంది. గ్రామస్థులతో సమావేశమైన అనంతరం మాందాపురం శివారులోని గుట్టల్లో విశ్రాంతి తీసుకుంటుండగా ప్రభాకర్‌రావు దళాన్ని నిజాం పోలీసులైన రజాకార్లు ఒక్కసారిగా చుట్టుముట్టి ఒక్కసారిగా తుపాకి గుండ్ల వర్షం కురిపించారు. గంటల తరబడి భీకర పోరులో వీరోచిత పోరాటం సల్పిన ప్రభాకర్‌రావు దళం నేలకొరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డిలతో పాటు మరో పది మంది దళ సభ్యులు ముస్కు చొక్కారెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, అయిరెడ్డి భూంరెడ్డి, తూమోజు నారాయణ, గుండి దామోదర్‌రెడ్డి, ఇల్లందుల పాపయ్య, పోరెడ్డి రాంరెడ్డి, నల్లగొండ రాజారం, చిక్కుడు సాయిలు, రోండ్ల మాధవరెడ్డి హతమయ్యారు. సాయుధ పోరాటంలో కరీంనగర్ జిల్లాలో జరిగిన మొట్టమొదటి ఎన్‌కౌంటర్ ఘటన ఇదే. మహ్మదాపూర్ గుట్టల ఎన్‌కౌంటర్‌లో అమరులైన 12 మంది అమరవీరుల స్మారకార్థం స్థూపాలు నిర్మించారు. ప్రతి ఏటా తెలంగాణా సాయుధ పోరాటాల యోధులను స్మరిస్తూ మహ్మదాపూర్ గుట్టల్లో సీపీఐ నాయకులు సంస్మరణ సభలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు.

హుస్నాబాద్ ఆర్డీవోగా రామ్మూర్తి

హుస్నాబాద్, మార్చి 13 : రెవెన్యూ డివిజనల్ అధికారుల బదిలీల్లో భాగంగా ఏటూరు నాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మూర్తిని హుస్నాబాద్ ఆర్డీవోగా బదిలీ చేశారు. ఇక్కడ పని చేసిన బెన్‌షాలోమ్‌ను యాదగిరి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ చేశారు.

గజ్వేల్ తహసీల్దార్‌గా శ్రావణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

గజ్వేల్, మార్చి 13: గజ్వేల్ తహసీల్దార్‌గా కె.శ్రావణ్‌కుమార్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. జగదేవ్‌పూర్ తహసీల్దారుగా పనిచేస్తున్న శ్రావణ్‌కుమార్‌ను గజ్వేల్ తహసీల్దారుగా బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనూచౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు గజ్వేల్ తహసీల్దారుగా పనిచేస్తున్న శ్రీనివాస్ సస్పెన్షన్‌కు గురికాగా, ఆయన స్థానంలో శ్రావణ్‌కుమార్‌ను నియమించారు. కాగా జగదేవ్‌పూర్ తహసీల్దారుగా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కృష్ణమోహన్‌ను నియమించారు.

నేడు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం

వర్గల్, మార్చి 13 : మండలంలోని మినాజీపేట సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా గురువారం మండలంలోని నాచారం, అనంతగిరిపల్లి, బోర్రగూడెం, జంగంపల్లి, చందాపూర్ గ్రామాలలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తునట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సంతోష్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

మద్దూరు, మార్చి 13: మండలంలోని రేబర్తి గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ నందు నిర్వహించే చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి ప్రతిభ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలతో పాటు గర్భిణులకు టీటీ ఇంజెక్షన్ ఇస్తారని తెలిపారు.

ఆర్మీకి అప్లై చేసేందుకు మరో వారం రోజులు

గజ్వేల్, రాయపోల్, మార్చి 13: ఇండియన్ ఆర్మీ ద్వారా వెలువడిన నోటిఫికేషన్ గడువు ఈ నెల 22న ముగుస్తుందని గజ్వేల్ ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నీల చంద్రం పేర్కొన్నారు. బుధవారం ఆయన గజ్వేల్‌లో మాట్లాడుతూ ఆర్మీలో చేరేందుకు ఆసక్తి గల యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 17 ఏళ్ల 6 నెలలకు పైబడి, 21 ఏళ్ల లోపు వయసు కలిగి 10వ తరగతి పాసైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ

చేర్యాల, మార్చి 13 : చేర్యాల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పాల లక్ష్మీనారాయణను ఎన్నుకున్నారు. బుధవారం కార్యవర్గ సభ్యులు స్థానిక వైశ్యభవన్‌లో సమావేశమై ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల ధూళిమిట్ట రైస్‌మిల్లు లావాదేవీల విషయంలో నెలకొన్న వివాదం కారణంగా అసోసియేషన్ అధ్యక్షుడు నేతి నారాయణ అసోసియేషన్ సూచన బేఖాతరు చేయడంతో పదవినుంచి తొలగించామన్నారు.

పేకాటరాయళ్ల పట్టివేత

కోహెడ, మార్చి 13: మండలంలోని శనిగరం గ్రామంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు, సిబ్బంది పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ 6,300 నగదు, 3 మొబైల్ ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.